ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024
5
శ్రీకాకుళం



రేపు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్‌టిఆర్ భరోసా కింద సెప్టెంబరు నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లను ఈనెల 31వ తేదీ నుంచే పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. పెన్షన్ల పంపిణీపై పలు శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని, ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చూడాలని చెప్పారు. మొదటి రోజే వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. పింఛను లబ్ధిదారులు సిబ్బందికి అందుబాటులో ఉండాలని కోరారు.

విస్తారంగా వర్షాలు

- జిల్లాలో సగటున 42.1 మి.మీ వర్షం
- సరుబుజ్జిలిలో అత్యధికంగా 65.75 మి.మీ వర్షపాతం నమోదు
- పలుచోట్ల రహదారులు జలమయం
- మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం



పలాస : కిష్టుపురం అండర్‌పాసేజ్‌లో చేరిన వర్షపు నీరు



ఆమదాలవలసలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గత 24 గంటలుగా సగటున 42.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నందిగాం మండలం మదనాపురంలో అత్యధికంగా 66.50 మి.మీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాల్లేక అల్లాడుతున్న రైతాంగానికి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఊరటనిస్తున్నాయి. ఆగస్టులో పెద్దగా వర్షాలు కురవక వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగుకు ఎంతగానో దోహదపడనున్నాయి.

జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు జోరందుకోనున్నాయి. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,21,655 ఎకరాల్లో వేస్తారని అంచనా వేశారు. వరి పంటను 3,87,322.5 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు అన్నిరకాల పంటలను కలిపి 3,62,593 ఎకరాల్లో (86 శాతం) రైతులు వేశారు. అందులో 3,37,803 ఎకరాల్లో (87 శాతం) వరి వేశారు. ఇందులో వెదల సాగు అధికంగా ఉంది. మొత్తం 2,28,005 ఎకరాల్లో రైతులు వేశారు. నారుమళ్లు 15,225 ఎకరాల్లో వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఇతర పంటల సాగుకూ సానుకూల వాతావరణం నెలకొంది. మొక్కజొన్న పంటను ఈ ఖరీఫ్‌లో 25,270 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకోగా 21,713 ఎకరాల్లో (86 శాతం) సాగవుతోంది. పత్తి పంటను 3,888 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 1865 ఎకరాల్లో (48 శాతం) సాగు నమోదైంది. వేరుశనగ పంటను 730 ఎకరాల్లో రైతులు వేస్తారని అంచనా వేయగా, 245 ఎకరాల్లో (34 శాతం) సాగవుతోంది. కంది 7.5 ఎకరాలు, పెసర 40 ఎకరాలు, మినప 38 ఎకరాల్లో సాగవుతోంది.

పలు మండలాల్లో వర్షపాతం వివరాలు

మండలం	ప్రాంతం	కురిసిన వర్షం (మి.మీల్లో)
సరుబుజ్జిలి	సరుబుజ్జిలి	94.2
జలుమూరు	జలుమూరు	70.2
నందిగాం	మదనాపురం	66.5
ఆమదాలవలస	ఆమదాలవలస	63.25
సంతబొమ్మాళి	సంతబొమ్మాళి	52
ఎచ్చెర్ల	ఎచ్చెర్ల	50.5
కవిటి	రాజపురం	34.5
ఎచ్చెర్ల	ఎచ్చెర్ల	33.75
శ్రీకాకుళం	శ్రీకాకుళం	48.5
పలాస	పలాస	37
రణస్థలం	పైడిభీమవరం	32.25
ఇచ్ఛాపురం	అరకభద్ర	31
పాతపట్నం	పాతపట్నం	13.8
గార	గార	10.5

లోటు తీరుతుందా?

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్ ఒకటో తేదీ నుంచి ఈనెల 29వ తేదీ వరకు సాధారణంగా 489.7 మి.మీ వర్షం పడాల్సి ఉండగా, 520.3 మి.మీ మేర వర్షం కురిసింది. ఆరు శాతం అదనంగా కురిసి సాధారణ వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణంగా 134.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 142.4 మి.మీ వర్షం కురిసింది. అదనంగా 5.6 శాతం వర్షం కురిసింది. జూలైకు సంబంధించి సాధారణ వర్షపాతం 184.4 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 223.5 మి.మీ వర్షం కురిసింది. అదనంగా 21.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టులో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 170.2 మి.మీ నమోదయ్యే పరిస్థితి ఉండగా, ఇప్పటివరకు 169.7 మి.మీ వర్షం కురిసింది. ఖరీఫ్ కాలానికి సంబంధించి జిల్లాలో పది మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. మరో 15 మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. వజ్రపుకొత్తూరు, పోలాకి, బూర్జ, జి.సిగడాం, నరసన్నపేట మండలాల్లో తీవ్ర వర్షపాతం లోటు కొనసాగుతోంది. అల్పపీడన ప్రభావంతో వర్షాలు మరో రెండు, మూడు రోజులు కురిసే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో జిల్లాలో వర్షపాతం లోటు భర్తీ కావచ్చని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు.

రూ.40 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్

జాతీయ క్రీడా దినోత్సవంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఖేలో ఇండియా పథకంలో భాగంగా పాత్రునివలసలో కేంద్ర ప్రభుత్వ నిధులతో దీని నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లలో క్రీడాకారులకు అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నగరంలోని డిఎస్‌ఎ ఇండోర్ స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రునివలసలో ఇప్పటికే నిర్మిస్తున్న క్రీడా వికాస ప్రాంగణంతో అన్ని క్రీడాంశాలను ఒకే చోటుకు తీసుకొస్తామని చెప్పారు. కోడి రామ్మూర్తి స్టేడియం చుట్టూ ప్రేక్షకుల గ్యాలరీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. చదువుతో పాటు క్రీడలను సమన్వయం చేసుకున్నవారు జీవితంలో అత్యున్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తే మానసిక దఢత్వం సాధించవచ్చన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు అందుకోవచ్చుని, గెలవడం కోసం చేసే ప్రణాళిక, శిక్షణ ఇవన్నీ భవిష్యత్‌కు మంచి బాటలు వేస్తాయని చెప్పారు.

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. ప్రతివారం పనుల పురోగతిని తాను స్వయంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడాంశాలలో విజయం సాధించిన వారికి కలెక్టర్, ఎమ్మెల్యే శాలువా, మెమోంటో, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అంతకుముందు ఏడు రోడ్ల కూడలి నుంచి శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియం వరకు క్రీడాకారులు 2కె ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ కె.శ్రీధర్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, ఒలింపిక్ అసోసియేషన్ సలహాదారు సుందరరావు మాస్టారు, కోచ్‌లు మాధురి, మణికంఠ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు అదనపు ఎరువుల కేటాయింపు

- కొరత లేకుండా చర్యలు
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఎరువుల కొరత లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరతపై జెడ్‌పి సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించడాన్ని పత్రికల్లో చూసిన ఆయన తక్షణ చర్యలకు అధికారులను ఆదేశించారు. జిల్లాకు తక్షణమే 820 టన్నుల డిఎపి, 760 టన్నుల యూరియాను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వీటిని ఈనెల 30వ తేదీ నుంచే రైతులకు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ మొదటి వారంలో వెయ్యి టన్నుల యూరియాతో పాటు అవసరం మేరకు డిఎపి పంపాలని మంత్రి ఆదేశించారు.

యాంత్రీకరణకు ప్రభుత్వం పెద్దపీట



ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి అన్నారు. రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానంలో వ్యవసాయ యాంత్రీకరణ మేళాను గురువారం నిర్వహించారు. మేళాలో 26 రకాల వ్యవసాయ యాంత్రీకరణ స్టాల్స్, యంత్ర పరికరాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రైతులు వ్యవసాయ యాంత్రీకరణపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ కూలీల కొరత నేపథ్యంలో యాంత్రీకరణతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులు అన్నిరకాల యంత్రాలను వినియోగించుకోవచ్చన్నారు. గతంలో వ్యవసాయానికి పెట్టుబడి ఎక్కువగా ఉండేదని, యాంత్రీకరణపై దృష్టిసారిస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. రైతులు యంత్ర సేద్యం దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో యాంత్రీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రాయితీతో కూడిన సబ్సిడీ సాగు యంత్రాలు, వ్యవసాయ పనిముట్లను రైతులకు అందిస్తున్నాన్నారు. ఆప్కాబ్, డిసిసిబి ద్వారా యంత్ర పరికరాలను రైతులకు తక్కువ వడ్డీకే అందిస్తోందని తెలిపారు. యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన, వ్యవసాయ క్విజ్, రైతు సదస్సు, వ్యవసాయ ప్రచురణల విడుదల, రైతులతో శాస్త్రవేత్తల చర్చాగోష్టి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్తర కోస్తా వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పండించిన పంటలపై తయారు చేసిన పుస్తకాలు, పాంప్లేట్స్, పోస్టర్లను ఆవిష్కరించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకులు డాక్టర్ పి.వి సత్యనారాయణ, డాక్టర్ ప్రమీలా రాణి, ఉత్తరాంధ్ర జిల్లాల ఆత్మ పీడీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసి కమిషనర్‌గా ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ (ఎస్‌ఎంసి) కమిషనర్‌గా పి.వి.విడి ప్రసాదరావును ప్రభుత్వం నియమించింది. ఈమేరకు జిఒ నంబరు 672 పేరుతో గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) జోనల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎస్‌ఎంసి కమిషనర్‌గా శ్రీకాకుళం వస్తున్నారు. ఎస్‌ఎంసి కమిషనర్‌గా తమీమ్ అన్సారియా బదిలీ అయిన తర్వాత ఇన్‌ఛార్జి కమిషనర్‌గా సుడా డైరెక్టర్ చల్లా ఓబులేసు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నేడు వన మహోత్సవం



ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 30వ తేదీన వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉదయం పది గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరవుతారని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ ఒక మొక్క నాటే విధంగా, పాఠశాల ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా, పరిశ్రమల వద్ద తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

దుబాయ్‌లో జిల్లా వాసి మృతి



శివ (ఫైల్)



సిబ్బందితో మాట్లాడుతున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి- కవిటి

పొట్ట కూటి కోసం దుబాయ్ వలస వెళ్లిన మండలంలోని బొరివంకకు చెందిన శివ మజ్జి (24) అక్కడ విధి నిర్వహణలో మృతి చెందాడు. శివను దుబాయ్‌కు పంపించిన కంపెనీ ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయకపోగా నిర్లక్ష్యపు సమాధానం చెప్పింది. వివరాల్లోకి వెళ్తే... బొరివంకకు చెందిన శివ మజ్జి ఇచ్ఛాపురం పట్టణంలోని పంచముఖి టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఆరు నెలల కిందట ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అక్కడ విధి నిర్వహణలో ఉండగా బుధవారం సంభవించిన ప్రమాదంలో మృతి చెందారు. ప్రతిరోజూ కుటుంబసభ్యులకు ఫోన్ చేసే శివ ఈనెల 28వ తేదీ నుంచి చేయకపోవడంతో శివ తల్లి ఊర్మిళ ఆందోళన చెందింది. చివరకు గురువారం మధ్యాహ్నం శివతో పాటు దుబాయ్ వెళ్లిన అదే గ్రామానికి చెందిన మోహన్ బిశాయి శివ మృతి వార్తను వారి కుటుంబ సభ్యులకు చేరవేశాడు. శివ సెల్‌ఫోన్, సామగ్రిని తనకు అప్పగించినా, మృతదేహాన్ని మాత్రం తనకు చూపించలేదని చెప్పారు.

కుటుంబసభ్యుల ఆందోళన

దీంతో ఆందోళన చెందిన శివ తల్లి ఊర్మిళ, బంధువులు పంచముఖి టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లారు. తమ బిడ్డకు ఏమైందని అడిగితే తమకు తెలియదని, కంపెనీ మేనేజర్ ఊరు నుంచి వచ్చాక చెప్తారంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో వారు ఇన్‌స్టిట్యూట్ వద్ద ఆందోళన చేపట్టడంతో, తమకు ఇంతవరకు ఎటువంటి సమాచారం రాలేదని, పూర్తి వివరాలు కనుక్కొని చెప్తామని ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది చెప్పారు. దీంతో వారు వెనుదిరిగారు.

ఎమ్మెల్యేకి వినతి

తమ బిడ్డ రెండు రోజుల నుంచి అందుబాటులో లేదని, విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు మృతి చెందాడని గ్రామానికి చెందిన వ్యక్తి చెప్పాడని శివ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బెందాళం అశోక్ వద్ద మొరపెట్టుకున్నారు. ఈ విషయంలో వాస్తవాలు తెలుసుకుని సహకరించాలని ఎమ్మెల్యేని కోరారు.

బోధనా నాణ్యతను పెంచాలి



లేబొరేటరీని పరిశీలిస్తున్న వైస్ ఛాన్సలర్ శారదా జయలక్ష్మి దేవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

వ్యవసాయ విద్యార్థుల ఉన్నతి, రైతులకు ఉపయోగపడేలా బోధన ఉండాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి దేవి అన్నారు. మండలంలోని నైరలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలను గురువారం సందర్శించారు. బోధనా సిబ్బంది, విద్యార్థులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించి కళాశాల అభివృద్ధికి కావాల్సిన అంశాల గురించి చర్చించారు. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోగలరని చెప్పారు. జెఆర్‌ఎఫ్, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. అనంతరం తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించారు. ఆమె వెంట వ్యవసాయ కళాశాల నైర అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెద్దపాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఎస్‌సి కేటగిరీలో 19 సీట్లు, ఒసి 1.. ఎస్‌సి కేటగిరీలో 6వ తరగతిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 9వ తరగతిలో ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీలో చెరో సీటు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపిసి 7 ఎస్‌సి, బైపిసి ఎస్‌సి 6, ఎస్‌టి కేటగిరీలో 1, బిసి కేటగిరీలో 1, ఒసి కేటగిరీలో 1 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీట్లు కావాల్సిన విద్యార్థినులు ఈనెల 30న ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో గురుకులంలో హాజరు కావాలని సూచించారు. సీట్లకు మించి అధికంగా విద్యార్థులు హాజరైతే పరీక్ష విధానాన్ని బట్టి సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాస్థాయి డిసిసి, డిఎల్‌ఆర్‌సి సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి తొలి త్రైమాసికం జూన్ 30వ తేదీ నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.12943 కోట్లకు గానూ రూ.4,887 కోట్ల రుణాలు మంజూరు చేసి 38 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.8,343 కోట్ల లక్ష్యానికి గానూ రూ.2,792 కోట్ల రుణాలు అందజేసి 34 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ లావాదేవీలు మరింత బలోపేతం చేయాలని సూచించారు. చిరు వ్యాపారులకు, చిన్న చిన్న యూనిట్లను స్థాపించే వారికి ముద్ర రుణాలు ఎంతో ప్రయోజనకరమన్నారు. పిఎంఇజిపి పథకం కింద రుణాలు మంజూరు చేసి, వెంటనే యూనిట్లను స్థాపింపజేయాలని ఆదేశించారు. ఈ మేరకు బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. ప్రభుత్వ పథకాల కింద రుణ మంజూరులో రానున్న మూడు నెలల్లో కచ్చితమైన ప్రగతిని చూపించాలని ఆదేశించారు. కౌలు రైతులు నష్టపోకుండా చూడాలని, వీలైనంత వేగంగా కౌలుదారుల గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలన్నారు. అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాలన్నారు. ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా జిల్లా జిడిపి వృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. పారిశ్రామిక రంగ అభివృద్ధితోనే ఇది సాధ్యమని, ఇందుకు ఇందుకు బ్యాంకర్లు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రతి గ్రామంలో రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను తరచూ నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల ద్వారా ప్రజల ధనాన్ని దోచుకుంటున్నారని, వీటి బారినపడి మోసపోకుండా విద్యార్థులు తమ కాలనీవాసులు, ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రయత్నించాలన్నారు. ఆర్‌బిఐ స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్‌కు సూచించారు. సమావేశంలో రీజనల్ మేనేజర్ ఎం.వి తిలక్, ఆర్‌బిఐ ఎపి రీజియన్ ఎల్‌డిఒ గిరిధర్ బెహరా, నాబార్డు డిడిఎం కె.రమేష్‌కృష్ణ, వ్యవసాయ, పశుసంవర్థకశాఖల జెడిలు కె.శ్రీధర్, జయరాజు, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

వ్యవహారిక భాషా పితామహుడు 'గిడుగు'


గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగు భాష ఔన్నత్యాన్ని నలుదిక్కులా చాటి చెప్పిన మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు మాధుర్యాన్ని ప్రజలకు అందించిన కీర్తి గిడుగుకే దక్కుతుందన్నారు. తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తుగా జయంతిని మాతృభాషా దినోత్సవంగా జరుపు కుంటున్నామన్నారు. తెలుగుభాషతో పాటు సవర లిపి కనుగొని భాషోధ్యమానికి కృషి చేశారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం రావ్ బహుదూర్ అని బిరుదు నిచ్చారన్నారు. కార్యక్రమంలో ఎల్.డి.ఎం సూర్య కిరణ్, కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మందిరంలో

తెలుగు భాష పునరుజ్జీవమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మాతృభాష దినోత్సవంతో పాటు తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా నగరంలోని గాంధీ మందిరంలో గిడుగు విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం కోసం గిడుగు చేసిన సేవలను కొనియాడారు. అవదాన పండితులు పైడి హరినాధరావు, నిష్టల నరసింహమూర్తి గేయాలను ఆలపించారు. గిడుగు విగ్రహ దాత మందపల్లి రామకృష్ణారావును ఆయన అభినందించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, నటుకుల మోహన్, మెట్ట అనంతం బట్లు, పందిరి అప్పారావు, సువ్వారి రాజారావు, శాస్త్రి తదితరులున్నారు.

'తెరవే' ఆధ్వర్యాన

నగరంలోని కొత్త బ్రిడ్జి రోడ్డులో ఉన్న గిడుగు విగ్రహానికి తెరవే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణ మూర్తి ఆధ్వర్యాన పూలమాల వేసి అంజలి ఘటించారు. భోగెల ఉమామహేశ్వరరావు, వావిలపల్లి రాజారావు, ఐఎన్‌డి.ప్రసాద్, తంగి ఎర్రమ్మ, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గిడుగు జయంతి నిర్వహించారు. ముందుగా గిడుగు చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, ప్రత్యూష, పి.రామమోహన్, టి.రాంబాబు, పాఠకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: అంబేద్కర్ విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన తెలుగు భాషా దినోత్సవం సభలో వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్ కిరణ్ కవితా సంకలనం ఖాకీ చొక్కా పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. సందర్భంగా వివిధ కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

లావేరు: తెలుగు వాడుక భాషోదయ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి గురువారం లావేరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరుపున విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే బుడుమూరు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం శ్రీనువాసరావు ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని మునసబుపేట గాయత్రి కళాశాల తెలుగు విభాగం నిర్వహించిన గిడుగు జయంతి సభలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామి నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యనారాయణ, డా.మార్తండా కృష్ణ, అప్పలనాయుడు, గౌరిశంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. అలాగే మండలంలోని కోర్లకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు తెలుగు ఉపాధ్యాయులు అడపా వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం గేదెల యమున గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి, జాతీయ క్రీడాదినోత్సవ సందర్భంగా మేజర్ ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శతకపద్యాలు, తెలుగుపాటల పోటీ, వక్తృత్వం, వ్యాసరచనలలో విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, శ్రీనివాసరావు, సరస్వతి, శ్యామల, కె.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామం సరుబుజ్జిలి మండలంలోని పర్వతాల పేటలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, టిడిపి నాయకుడు నందివాడ గోవిందరావు, జనసేన నాయకులు భూపతి అర్జున్, కీర్తి సుశీల, అప్పలరాజు, జగదీష్ పాల్గొన్నారు.

రణస్థలం: తెలుగును కలలోనైనా మరువొద్దని ప్రముఖ కవి, ప్రసిద్ధ రచయిత శ్రీశ్రీ కళా వేదిక ఉత్తరాంధ్ర కోస్తా అధ్యక్షులు మహ్మద్ రఫీ (ఈవేమన) ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. వెలుగులు పంచే తేనె లాంటి మన తెలుగును మరువకూడదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారభాషగా తెలుగులోనే వ్యవహారాలన్నీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈయనతో పాటు కార్యదర్శి జంధ్యాల శరత్ బాబు, వి. రాజారావు, ఉదయకిరణ్ పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డా.సిహెచ్.ఉదయ్‌లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.కె.వాసుదేవరావు, తెలుగు ఉపన్యాసకులు ఎస్‌పి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు. మండలం తండ్యాం పంచాయతీ గూనానపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం గురుగుబెల్లి మధుబాబు ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చుక్కల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో...

భాష్యం ప్రైవేటు పాఠశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. గిడుగు రామూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవిటి: మహనీయుల జీవితాలు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పార్నంది శర్మ తన మాతృమూర్తి ఛాయాదేవి జ్ఞాపకార్థం పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన గిడుగు వెంకట రామమూర్తి విగ్రహాన్ని ఎమ్మెల్యే అశోక్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేకు ఆత్మీయ సత్కారం చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, టిడిపి నాయకులు బెందాళం రమేష్, ఆరింగి మధు, బెందాళం సురేష్, ప్రగడ మణి, వజ్జ రంగారావు, పాఠశాల కమిటీ ఛైర్మన్ టి.మోహనరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : తెలుగు అక్షరంలో కూర్చున్న విద్యార్థులు

నరసన్నపేట : పద్మావతి కళాశాలలో నిర్వహించిన గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకల్లో డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, తెలుగు అధ్యాపకులు లక్కోజు గౌరీ శంకర్, అకడమిక్ ఇన్‌ఛార్జి ముకళ్ల శ్రీనివాసరావు, పద్మనాభవం, కె.రాము, రమణ పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన రామ్మూర్తి జయంతి వేడుకల్లో అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్, జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కుదమ తిరుమలరావు, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, ప్రముఖ రచయిత కుత్తుమ వినోద్, కె.రోజారాణి పాల్గొన్నారు.

రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గిడుగు రామమూర్తి జానపద కళాపీఠ వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు మాష్టర్, మూల తాతయ్య మాస్టర్, ఉపాధ్యాయులు మురళి, సాంబమూర్తి, కిరణ్, దేవా జగదీశ్వరి, ప్రవీణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రీతీచౌదరి, జగదీష్, భాస్కర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పురుషోత్తపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాష దినోత్సవంలో ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పురుషోత్తంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.వి.లత ఆధ్వర్యాన విద్యార్థుల చే ప్రదర్శన చేసిన తెలుగు అక్షర ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

కొత్తూరు : స్థానిక శ్రీరాజ్ శ్రీనివాస్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవంలో డైరెక్టర్ భూదేవి, చిన్నంనాయుడు, ప్రిన్సిపాల్ తిరుపతిరావు, ఎం జి.సింహాచలం పాల్గొన్నారు. ఇరపాడు ఎంపియుపి స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మెట్టూరు బిట్-3 సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక శాఖ గ్రంథలయం, పెద్దతామరాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్ కిరణ్, ప్రధానోపాధ్యాయులు కె.బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు బి.శంకరరావు, వి.కుమారి పి.వనతి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి శాఖాగ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బి.రూపావతి రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

సోంపేట : సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, పలాసపురం ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు షేక్ సలీం, వ్యాయామ ఉపాధ్యాయులు పాపారావులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, రజనీకుమార్, రామినాయుడు, ఎం.ప్రసాద్, యుగంధర్, ప్రవీణ్, సంధ్యారాణి, కల్పన, నారాయణ, శ్రావణ్, రవికుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


కవిటి : విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్



పలాస : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కుమార్ నాయక్

కోటబొమ్మాళి: మండలంలోని దంత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాష దినోత్సవంలో ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్, ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణరావు జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త పూడి జనార్ధనరావు, ఉపాధ్యాయులు ఆనందరావు, మన్మధరావు, నిర్మల, రామారావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో రత్నకుమారి, టి.హేమసుందరరావు, బి.మురళి, వందన పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, లీలాపద్మజ, వి.తిరుమలరావు పాల్గొన్నారు. నర్సింగపల్లిలో ప్రధానోపాధ్యాయులు ఎ.సోమేశ్వరరావు, తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, కె.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎం.అనురాధ, ఓక్లాండ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ మళ్ల మధులత ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

మందస : మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు తెలుగు ఉపాధ్యాయులు ఎస్.అబ్రహం, వ్యాయమ ఉపాధ్యాయులు బి.రమేష్‌లను సన్మానించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, పి.రాంబాబు, జి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పేదల వైద్యుడు మాధవరావు చౌదరి

ప్రజాశక్తి- సోంపేట

చిన్నతనం నుంచే వైద్యుడై ప్రజలందరికీ సేవ చేయాలన్న లక్ష్యంతో అహర్నిశలు శ్రమించి వైద్యుడిగా అచిర కాలంలోనే ప్రజల్లో ఉన్నతమైన గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి డాక్టర్ కదంబల మాధవరావు చౌదరి. మండలంలోని పాలవలసలో జన్మించిన ఆయన సాధారణ వైద్యుడిగా జీవితాన్ని ప్రారంభించి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ఉన్నత శిఖరాలను అధిరోహించి, ఈ నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు.

1962 ఆగస్టు 24న మండలంలోని పాలవలసలో కదంబల గురునాథం, రత్నంలకు మాధవరావు చౌదరి జన్మించారు. ఏడో తరగతి వరకు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. 8 నుంచి పదో తరగతి వరకు బారువ జిల్లా పరిషత్ పాఠశాలలో చదివారు. 1977లో పదో తరగతి ఉత్తీర్ణులై బారువాలోనే ఇంటర్మీడియట్ పూర్తి చేశారు.


డాక్టర్ మాధవరావు చౌదరి

అనంతరం శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ చదివారు. పది నెలల అనంతరం... 1979 నుంచి 1986 వరకు విజయవాడలోని నాగార్జున యూనివర్సిటీలో ఆయుర్వేదిక్ మెడిసిన్ పూర్తి చేశారు.

ఉద్యోగ జీవితం

1987, జనవరి 15న విజయనగరం జిల్లా కురుపాం మండలం శివన్నపేటలో తొలిసారిగా వైద్యుడిగా నియామకమయ్యారు. అనంతరం గిరిజన ప్రాంతమైన రస్తా కుంట బాయ్ గ్రామంలో మెడికల్ ఆఫీసర్‌గా చేరారు. అనంతరం ఉద్యోగోన్నతిపై 2010లో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా హైదరాబాద్ వెళ్లారు. అక్కడి నుంచి 2021 నవంబరు 25న ఉద్యోగోన్నతి పొంది నంద్యాల జిల్లా, బనగానపల్లి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా చేరారు.

కుటుంబం

వైద్యుడిగా ఉద్యోగం పొందిన తరువాత 1990, ఫిబ్రవరి 28న రజనీతో ఆయనకు స్వగ్రామం పాలవలసలో వివాహమైంది. వీరికి స్వాతి చౌదరి, స్నేహ చౌదరి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరికి వివాహాలు జరిగాయి.

అవార్డులు

1984లో రాష్ట్రస్థాయి అంతర్ కళాశాల పోటీల్లో ఉత్తమ నటుడుగాను, ఉత్తమ దర్శకుడు గాను అవార్డులు పొందారు. తాను నటించిన మా సమాధులే మీ పునాదులు అనే నాటికలో ఆయన చూపిన నటనకు ఈ అవార్డులో దక్కాయి. అలాగే ఆలిండియా రేడియోలో సైతం ఈయన పలు ఆరోగ్య కార్యక్రమాలను, నాటికలను ప్రసారం చేశారు.

ఈటివిలో అన్నదాత కార్యక్రమంలో సైతం గిరిజన ప్రాంతాల్లో దొరికే ఔషధ మొక్కలు వాటి ఉపయోగాలపై కార్యక్రమాలను నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో సుదీర్ఘకాలం సేవలందించినందుకు 2018లో రూట్స్ హెల్త్ ఫౌండేషన్, విజయవాడ వారు రాష్ట్రస్థాయి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. వృత్తిలో చేసిన సేవలు గాను విశాఖపట్నంలోనూ, శ్రీకాకుళంలో ఉత్తమ వైద్యుడిగా కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులు పొందారు. అలాగే జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ తరపున ఉత్తమ డాక్టర్‌గా అవార్డు స్వీకరించారు. వృత్తితో పాటు వైద్య రంగానికి సంబంధించిన పలు సంఘాలు, సంస్థల్లో అధ్యక్షుడుగాను, కార్యదర్శిగాను యూనియన్ లీడర్ గాను సేవలందించి నేటి యువ వైద్యులకు స్ఫూర్తిగా నిలిచారు.

సదరం తప్పుడు ధ్రువపత్రాలపై విచారణ

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

సదరం ధ్రువీకరణ ద్వారా నకిలీ వికలాంగ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్న వారి జాబితాలపై విచారణ చేపట్టి ఫేక్ సర్టిఫికెట్లు గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమదావలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సదరం ధ్రువీకరణతో వికలాంగులు కాని అనర్హులు సైతం పింఛన్లు పొందుతున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సదరంలో వికలాంగులు కానివారికి పర్మినెంట్ ధ్రువీకరణలు ఇచ్చారని, పూర్తి స్థాయిలో వైకల్యం ఉన్నవారికి టెంప్రరీ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ నెల 31న పింఛన్లు పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో ఖాళీగా ఉన్న డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని తహశీల్దార్ రమేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డిపోకు సరుకులు వెళ్లే క్రమంలో బస్తాల నుంచి సరుకులను హమాలీలు తొలగించడం జరుగుతుందన్నారు. దీంతో డిపోలకు చేరేసరికి బస్తాలలో సరుకు వ్యత్యాసాలు వస్తున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఎరువుల విక్రయాలు జరిగినప్పటికీ ఇంకా ఆన్‌లైన్‌లో నిల్వలు ఉన్నట్లు చూపిస్తే మరలా అవసరం మేరకు మంజూరు ఎలా జరుగుతుందని ఎఒను నిలదీశారు. మండలంలో పలువురు విఎఎలు పనితీరు బాగులేదని వారికి మెమోలు జారీచేయాలని ఎఒను ఆదేశించారు. మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలని, అందరూ సహకరిస్తే సుమారు 1000 ఎకరాల్లో రూ.10వేల కోట్లుతో థర్మల్ పవర్ విద్యుత్ స్టేషన్‌ను ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎంఇఒ రామరాజు, పట్నాన రాజారావు, ఎపిఎం శ్యామలరావు, ఎపిఒ శ్రీనివాసరావు, వైద్యాధికారులు రమేష్‌నాయుడు, శివశంకర్, సుధీర్‌కుమార్, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

లింగ నిర్ధారణ నేరం


స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

పలాస : తల్లి గర్భంలో పెరుగుతున్న బిడ్డను తెలుసుకొనేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్‌డిఒ భరత్ నాయక్ స్కానింగ్ సెంటర్ల యజమానులకు హెచ్చరించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో లింగ నిర్ధారణ పరీక్షలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం ఒక ప్రయివేటు ఆస్పత్రిలో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనకు లోబడి స్కానింగ్ సెంటర్లు నడపాలన్నారు. స్కానింగ్ సెంటర్ విధి విధానాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. స్కానింగ్ సెంటర్లకు వచ్చిన రోగుల, గర్భిణుల వివరాలు నమోదు చేసి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పిసిపిఎన్ డిటి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సిద్దాబత్తుల సూర్యకళ, వైద్యులు పాపినాయుడు, సుశీల, ఎన్‌జిఒ సంఘం నాయకులు నిరంజన్ పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బంది తీరు మారదా?

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డులోకి వచ్చే రోగులను అప్యాయంగా పలకరించిన వైద్యం అందించాలని వ్యవసాయశాఖ మంత్రి ఇటీవల నిర్వహించిన అభివృద్ధి సలహామండలిలో సమావేశంలో సూచించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను, బంధువులను పలకరించి వైద్యం చేస్తే వాళ్ల సంతోషంతో సగం రోగం తగ్గిపోతుందని చెప్పారు. అయినా ఆస్పత్రి సిబ్బంది తీరు మాత్రం మారేటట్టు కపినించడం లేదు. ఎమర్జెన్సీ వార్డుకు రోగులు వస్తే కనీసం స్ట్రెక్చర్ కూడా ఇచ్చే పరిస్థితి లేదు. సిబ్బంది మాత్రం దానికి విరుద్ధంగా వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చే వారికి పలకరింపు లేదు సరికదా... వైద్య సేవలు కూడా అందించడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. బుధవారం రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు గాయపడింది. ఆస్పత్రికి తీసుకొస్తే... కనీసం స్ట్రెక్చర్ సదుపాయం కల్పించలేదు. దీంతో క్షతగాత్రురాలిని ఆమె బంధువులు ఎత్తుకొని వెళ్లి బెడ్‌పై వేశారు. దీన్ని చూస్తేనే అర్థమవుతోంది వైద్యం ఏ స్థాయిలో అందిస్తున్నారో?.


క్షతగాత్రురాలిని మోసుకుని వెళ్తున్న బంధువు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోటబొమ్మాళి : మండలంలోని జర్జంగి-చల్లపేట రహదారిలో గంగుపేట గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యలమంచిలికి చెందిన బెండి వరహాలు అక్కడకక్కడే మృతిచెందాడు. మృతుడు అదే గ్రామానికి చెందిన మామిడివలస మల్లేశ్వరరావుతో గురువారం నారాయణవలస సంతకు పశువుల వ్యాపారం కోసం బైక్‌పై వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో గంగుపేట సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కన ఉన్న ఒక నీటికుంటలో పడ్డారు. ఈ ప్రమాదంలో వరహాలు అక్కడిక్కడే మృతి చెందగా, మల్లేశ్వరరావు కొంత దూరం తుళ్లిపడి గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టెక్కలి సిఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యాన గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు హాజరై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన బాల్యంలో క్రీడలపై ఆసక్తి కనబరచడం వలన ఎన్నో ప్రయోజనాలు పొందగలరన్నారు. క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వ్యాయామ అధ్యాపకులు బర్రి మోహనరావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు అనేకమంది జాతీయస్థాయిలో మంచి గుర్తింపు పొందారన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని కళాశాలలో వివిధ క్రీడల్లో గెలుపొందిన అధ్యాపకులు, విద్యార్థులకు బహుమతులను అందజశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి. సత్యనారాయణ, వ్యాయామ అధ్యాపకులు జ్యోతి కుమార్, ఎన్‌సిసి కెప్టెన్ పోలినాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ పాత్రో, కెమిస్ట్రీ విభాగ అధిపతి ఆదినారాయణ, అర్థశాస్త్ర విభాగ విభాగధిపతి సిహెచ్ రామమూర్తి, శశిభూషణరావు, రమణ, ఢిల్లేశ్వరరావు, మోహనరావు, రాజశేఖర్, ప్రదీప్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఉత్సాహం వస్తుందని బుడుమూరు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం శ్రీనువాసరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ద్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు, ఎస్‌కె.ప్రసాద్, ఎం.అనురాధ, కె.వెంకటరావు, తమ్మినాయుడు, రమేష్ బాబు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.


నరసన్నపేట : సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది


ఇచ్ఛాపురం : బహుమతులను అందజేస్తున్న జోహార్‌ఖాన్

పలాస : కాశీబుగ్గ, గోవిందపురం, పలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ విగ్రహాలకు ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు, కె.హరిబాబు, టి.చిట్టిబాబులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మెంబర్ పి.తవిటయ్య, సిహెచ్.పద్మలోచనం, పి.గజేంద్ర, చంద్రశేఖర్, వై.కె.హరనాథ్, కె.రామారావు పాల్గొన్నారు.

బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, తెలుగు ఉపాధ్యాయులు ఈశ్వరరావు, రజనికుమారి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జ్ఞానభారతి పాఠశాలలో కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జోహార్ ఖాన్ అధ్యక్షతన జాతీయ క్రీడా దినోత్సవం దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఇటీవల జాతీయ టైక్వాండో పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ కుమార్ పండా, డి.రాములకు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాప్తిను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ ఇందు భూషణ్‌పండా, హెడ్ మిస్ట్రెస్, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ట్రాన్స్‌పోర్టర్ మేనేజర్ అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.

కవిటి: కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిజి పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలల్లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బల్లెడ రమేష్, తెలుగు ఉపాధ్యాయిని జోత్స్నను సన్మానించారు.

నరసన్నపేట : స్థానిక శ్రీజనజ్యోతి పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోర రామారావు, వెలమల భాస్కరరావు, తర సత్యనారాయణ, పాగోటి లక్ష్మిలు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎన్ఎస్‌డి అక్షరాల రూపంలో కూర్చుని వినూత్నంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి, ఉపాధ్యాయులు సాయిరాం, రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.మధు పాల్గొన్నారు.

స్థానిక వేదిక కార్యాలయంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర నాయకులు కోనార్ హేమసుదన్, సిహెచ్.జగదీష్, కొర్రాయి శ్రీకాంత్, దుబ్బరాజ గోపాల్, కె.బాలాజీ పాల్గొన్నారు.

టెక్కలి : కె.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ, ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, పి.జగదీష్, నారాయణరావు పాల్గొన్నారు.


ఆమదాలవలస : సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మల్లేశ్వరమ్మకు సత్కారం

ఆమదాలవలస : వ్యాయామ ఉపాధ్యాయులు పేడాడ మల్లేశ్వరమ్మ చేసిన సేవలకు స్వతంత్ర దినోత్సవం సందర్భంగా సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జి ఎపిసి తిరుమల చైతన్య చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోవడం అభినందనీయమని ఆమదాలవలస మున్సిపల్ గేటు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదనరావు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.రమణ, కాంతారావు, రవి, ఆనంద్, పి.వి.రమణమ్మ పాల్గొన్నారు.



మొక్కను అందజేస్తున్న కళాశాల సిబ్బంది

ఎమ్మెల్యే దృష్టికి మోడల్ స్కూల్ సమస్యలు

ప్రజాశక్తి- సోంపేట

ప్రభుత్వ మోడల్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ బీన ఈశ్వరరావు, ప్రిన్సిపల్ చిన్నాజీవర్మలు కోరారు. కవిటి మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారిని బాగు చేయించాలని, విద్యుత్ స్తంభాల విషయంలో చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో పి.రూపవతి, డి.జోగారావు, వి.అశోక్, భాస్కరరావు, రాజు, రాజేష్ పాల్గొన్నారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న ఎంపిపి, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే రవికుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

ఆమదాలవలస ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత తొలిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి హాజరైన కూన రవికుమార్‌ను ఎంపిపి, ఎంపిడిఒ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకు ఎంపిపి కిల్లి ఉషారాణి, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల పరిషత్ సిబ్బంది దుశ్శాలువకప్పి జ్ఞాపికను అందజేశారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శాలిహుండం కెజిబివి తనిఖీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

కెజిబివి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆర్.సన్యాసినాయుడు ఆదేశించారు. గార మండలంలోని శాలిహుండంలో ఉన్న కెజిబివిని గురువారం తనిఖీ చేశారు. స్కూల్‌లో వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు, భోజనం తదితర అంశాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. బాలల హక్కులను, గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి వివరించారు. అనంతరం అంపోలులోని జిల్లా జైలుని సందర్శించారు. కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్, ప్యానెల్ అడ్వకేట్, ఉపాధ్యాయులు, జిల్లా జైలు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు

హెల్త్ ఎడ్యుకేటర్స్ సంఘ అధ్యక్షులుగా విజయలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ గురువారం ప్రారంభించారు. ఈ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా ఎం.వెంకటేశ్వరావు, అధ్యక్షులుగా సనపల విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎస్.ఫాతిమాబీబి, కె.లక్ష్మి, సెక్రటరీగా డి.మంగమ్మ, జాయింట్ సెక్రటరీగా పి.స్వాతి, కోశాధికారిగా పి.మోహిని, ఉప కోశాధికారిగా ఆర్.ధనలక్ష్మి, జనరల్ సెకరేటరీగా చిన్నతల్లి, ఎమ్.ఎమ్ సుశీలారాణి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్.నిర్మల ఎన్నికయ్యారు.

నేడు వనం - మనం

ఆమదాలవలస: ఈ నెల 30న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వనం - మనం కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొననున్నట్లు ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో శాసనసభ్యులు రవికుమార్ పాల్గొంటారని ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

పోలాకి: మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారికి చర్యలు తప్పవని ఎస్ఐ జి.రంజిత్ హెచ్చరించారు. మండలంలోని ఈదులవలస కూడలి వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపిన వారు లైసెన్స్‌లు, ధ్రువపత్రాలు ఉండాలన్నారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవన్నారు. ఫోన్లలో మాట్లాడుకొని డ్రైవ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి



మాట్లాడుతున్న శంకరనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజ అభివృద్ధి విద్యతోనే సాధ్యమన్ని, ప్రతిఒక్కరూ చదువుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకర నారాయణ అన్నారు. గురువారం కళాశాలలో కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధిని సాధించాలన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు విద్యనే ఆయుధంగా మార్చుకుని అంతర్జాతీయ ప్రమాణాలు అందుకోవాలన్నారు. తద్వారా సమాజానికి మేలు చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజిక్స్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ డాక్టర్ పి.స్వర్ణలత మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. సైన్స్ నిత్యజీవితంలో భాగంగా మార్చుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ రాధాకృష్ణమూర్తి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ డార్విన్ "జీవ పరిణామ సిద్ధాంతాన్ని అనుసరించి మానవుల రూపాంతరంలో వచ్చిన మార్పులను వివరించారు. ఖండాలు, దేశాలు, ప్రాంతాలు, రంగు, మతాలు, కులాలకు అతీతంగా మనుషులంతా ఒక్కటే అన్న భావం ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ పద్మావతి, అధ్యాపకులు రామ జోగినాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కనుగుల వలసకు వెళ్లే రహదారిలో నాలుగు త్రీఫేస్ హై లెవెల్ విద్యుత్ స్తంభాలు రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా రైలు పట్టాల వైపు ఒరిగి పోయాయి. ఇటీవల రైల్వే సిగ్నల్ పనుల్లో భాగంగా కేబుల్ వేయడానికి రహదారి పక్కనే రైల్వే కూలీలు గోతులు తవ్వారని గ్రామస్తులు చెబుతున్నారు. గోతులు తీయడం, అలాగే వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు రైల్వే పట్టాల వైపు ఒరిగి పోయినట్టు పలువురు చెబుతున్నారు. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో పెను ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు అటు వైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



రైలు పట్టాల వైపు ఒరిగిన విద్యుత్ స్తంభం



మాట్లాడుతున్న జడ్జి హరిప్రియ

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

టెక్కలి : సెప్టెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.హరిప్రియ సూచించారు. కోర్టు ఆవరణలో పోలీస్, న్యాయవాదులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్, వంటి కేసులని పరిష్కరించే విధంగా చూడాలన్నారు. లోక్‌అదాలత్‌లో తీర్పు అంతిమతీర్పు అని అన్నారు. రాజీ మార్గానికే ప్రాధాన్యత కల్పించాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు దివ్వల వివేకానంద, టెక్కలి, మెళియాపుట్టి పోలీసులు పాల్గొన్నారు.

ఒకరోజు ముందుగానే పింఛను

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం ప్రతినెలా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు 1న అందిస్తున్న సామాజిక భద్రత పింఛన్లను ఈ నెల 31న శనివారం పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని పంపిణీ చేయమని ఆదేశించిందని ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామాల్లో పింఛనుదారులందరూ పింఛను పొందడానికి 31న ఉదయం సిద్ధంగా ఉండాలన్నారు. ముందురోజు పింఛను పంపిణీ జరగబోతుందని పింఛనుదారులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు.

లావేరు: ఎన్‌టిఆర్ సామాజిక పింఛన్లు పంపిణీ ఈనెల 31న సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వచ్చి పంపిణీ చేయడం జరుగుతుందని పింఛనుదారులు ఇంటివద్దే ఉండాలని ఎంపిడిఒ సురేష్ కుమార్ తెలిపారు. ఆదివారం కూడా పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.



దర్యాప్తు చేస్తున్న అధికారులు

కొనసాగుతున్న పింఛన్ల దర్యాప్తు

కోటబొమ్మాళి: ఇటీవల స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉపాధి హామీ ప్రజావేదికలో దంతలో 320 పింఛన్లకు, 72 వికలాంగు పింఛన్లు ఉన్నట్లు సంబంధిత జాబితాలో బయటపడింది. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం దర్యాప్తు నిర్వహిస్తే... 22 మంది హాజరయ్యారు. గురువారం మళ్లీ సచివాలయం వద్ద జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా సదరన్ వైద్య బృందం దర్యాప్తు చేశారు. ఈ సందర్భంగా వికలాంగులకు సదరన్ నిర్వహించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్, అసిస్టెంట్ డైరెక్టర్ డిజేబుల్ వెల్ఫేర్ కవిత, ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కంచిలి: మండలంలోని కర్తలికి చెందిన పైల రిషి అనే రెండేళ్ల బాలుడు కేన్సర్ వ్యాధికి గురై విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న దాతలు నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడి వైద్యానికి తోచినంత సహాయాన్ని అందజేస్తున్నారు. అన్నవరం హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు గురువారం బాలుడి వైద్యానికి కుటుంబ సభ్యులకు రూ.93 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎన్.దాసు, ఎం.హేమసుందర్, ఎస్.గణేష్, పి.విస్సు, ఎన్.రమేష్, ఎన్.శేఖర్, ఎన్.చైతన్య, ఎస్.వంశి, యువరాజు, శివశంకర్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

సిల్ట్ తీశారు... రోడ్డుపై మరిచారు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో మురికి కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ (పూడికతీత) పనులను పురపాలక సంఘం అధికారులు చేపట్టారు. ఇటీవల ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషితో పురపాలక సంఘానికి పారిశుధ్య పనుల నిర్వహణకు రూ.29.71 లక్షలు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. గడచిన వారం రోజులుగా పలు వార్డుల్లో పూడికతీత పనులను చేపట్టారు. 15వ వార్డులోని పాతినవారివీధి, 17వ వార్డులోని పూజారిపేట, మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో కాలువల నుంచి తీసిన సిల్ట్‌ను డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా రోడ్డుపైనే విడిచిపెట్టడంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి సిల్ట్ మళ్లీ కాలువలోకి జారిపోతుండడంతో పలువురు మున్సిపల్ అధికారుల పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. పురపాలక సంఘ అధికారులకు చేసే పనులపై చిత్తశుద్ధి లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు.



మురుగు కాలువ పక్కనే నిల్వ ఉన్న సిల్ట్

ప్రభుత్వం సీజనల్ వ్యాధులను అరికట్టడానికి నిధులు మంజూరు చేసి పాటు పడుతుంటే పురపాలక సంఘ అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని తీసిన చెత్తను తరలించకుండా నివాస సముదాయాల మధ్య విడిచి పెట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సిల్ట్‌ను తరలించి ప్రజారోగ్యానికి సహకరించాలని పలువురు కోరుతున్నారు.



శస్త్ర చికిత్సలకు రోగులను బస్సులో తరలిస్తున్న సిబ్బంది

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రణస్థలం

కంటి ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కళ్యాణి కంటి ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి తెలిపారు. మండల కేంద్రంలోని కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 124 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 12 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఇంద్రియాలు అన్నింటిలో కన్ను ప్రధానమైనదని, కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేసేవారు తప్పనిసరిగా మధ్యలో కాస్త విరామం తీసుకోవాలని, అలాగే కంటి రెప్పలను ఆడిస్తుండాలని, దీని వలన కళ్లు పొడిబారకుండా ఉంటాయన్నారు. అలాగే కళ్లను తరచుగా చేతితో తాకడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రతినిధి సోమేష్ పాల్గొన్నారు.

క్లీన్, గ్రీన్ ఆంధ్రాకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని సెప్టెంబర్ 2న క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య పిలుపునిచ్చారు. క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్రలో భాగంగా నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఉన్న ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రా గ్రీన్ ఆంధ్రాలో భాగంగా ఊరు, వాడ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరూ 100 మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ పండా, ఆమదాలవలస నియోజక వర్గం ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, కీర్తి సుశీల, చిట్టి భాస్కర్, రాజేష్, జగదీష్, శంకర్, సురేష్, మోహన లక్ష్మి, వరప్రసాద్ యాదవ్ (వర), అనిల్ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సత్య తదితరులు

శాంత అనురాగ నిలయంలో అన్నదానం



కేకు కట్ చేస్తున్న అక్కినేని అభిమానులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీ నటుడు అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలను జిల్లా అక్కినేని ఫ్యామిలీ ఫాన్స్ ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయన అభిమానులు శాంత అనురాగ నిలయంలో కేకు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, అక్కినేని ఫామిలీ ఫాన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు జె.బోసు, గాంధీ జిల్లా అధ్యక్షులు ఎల్ శ్రీను, ఉపాధ్యక్షులు ఎ.మూర్తి, కార్యదర్శి ఇ.శోభన్, ఆర్గనైజర్ విజయ్, సలహాదారులు సత్య, హరగోపాల్, పి.సంతోష్, శివ, ఎస్.త్రినాథ, డి.హరీష్, వి.తేజ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బారువ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థల సహకారంతో మీకు తెలుసా పేరిట గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు ఎయిడ్స్ వ్యాధి సోకే మార్గాలపైన, వాటిని నియంత్రించే పద్ధతులపైన వివరించారు. వ్యాధి సోకిన వ్యక్తులకు ఆధునిక చికిత్స పద్ధతులను వివరించారు. విద్యార్థులు ఎయిడ్స్ నివారణపై సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గురించి తెలియచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.మోహనరావు, హసన్ తుల్లా ద్యార్థిని పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మాధవరావు



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

'ఎస్ మార్ట్' ప్రారంభం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని తెంబూరు కూడలి వద్ద పెద్దలక్ష్మీపురం సర్పంచ్ అన్నపు ఉమామహేశ్వరరావు నూతనంగా ఎస్.మార్ట్ షాపింగ్ మాల్‌ను నిర్మించారు. దీనిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులను అందించాలనే ఉద్దేశంతో ఎస్.మార్ట్‌ను ఏర్పాటు చేయడం మంచి ఆలోచన అని అన్నారు. ఆలోచన మంచిదన్నారు. కార్యక్రమంలో పిఎస్ఎస్ మాజీ అధ్యక్షులు మిరప బెల్లి శ్యామ్‌సుందర్, సిరిపురం తేజేశ్వరరావు, మాజీ సర్పంచ్ బమ్మిడి సింహాచలం, కాకర్ల మల్లేశ్వరరావు, బోయిన చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలిరూరల్ : మండలంలోని నర్సింగపల్లి, మొఖలింగపురం పంచాయతీ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి వార్షిక మరమ్మతులు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో మెయిన్ రోడ్డులో ఉన్న శ్మశాన వాటికలో నూతనంగా నిర్మిస్తున్న గ్యాస్ దహన సంస్కార నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. రోటరీక్లబ్ ఆధ్వర్యాన అధునాతనమైన సౌకర్యాలు కల్పించేందుకు రోటరీ క్లబ్ ముందుకొచ్చింది. దీంతో ప్రజా అభిప్రాయంతో శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్యాస్ దహన సంస్కార నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పైడిశెట్టి దినేష్‌కుమార్, అసిస్టెంట్ గవర్నర్ రజనీకాంత్, రామారావు, రోహిత్, వి.కె.ప్రసాద్, రామకోటి, వి.సురేష్, జోగారావు, డాక్టర్ వేదవ్యాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వాయిదా

కోటబొమ్మాళి: మండలంలోని దండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక కోరం పూర్తికాక ముచ్చటిగా మూడోసారి వాయిదా పడింది. 8 తరగతులకు గాను, 5 తరగతుల్లో చైర్మన్‌లను ఎన్నుకున్నారు. మూడు తరగతుల్లో కోరం పూర్తికాక అప్పట్లో ఎన్నుకోలేదు. మూడో తరగతులు మాత్రమే పూర్తికాని నేపథ్యంలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు హాజరు కాకపోవడంతో మూడోసారీ వాయిదాకు దారి తీసింది. గతంలో జరిగిన ఘర్షణల నేపథ్యంలో టెక్కలి సిఐ కె.శ్రీనివారావు, ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీలు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులుగా ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్, ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్‌లు, ఉపాధ్యాయులు మెండ మన్మథరావు, పూతి జనార్దనరావు, ప్రధానోపాధ్యాయుడు గొండు నారాయణరావు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

కాలువ నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

మేజర్ పంచాయతీ కవిటి అగ్నికుల క్షత్రియ వీధిలో కాలువ నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు సర్పంచ్ పూడి లక్ష్మణరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలువ లేక తమ వీధిలో మురుగు నీరు నిల్వ ఉండడంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. అదేవిధంగా వాడుక నీరు వెళ్లేందుకు అవకాశం లేక ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతుందన్నారు. తమ సమస్యలు గుర్తించి వీధిలో కాలువ నిర్మాణం చేయాలని కోరారు.